
సాక్షి
ఏలూరు
శనివారం । 27 । ఏప్రిల్ । 2024



నగదు స్వాధీనం
సార్వత్రిక ఎన్నికల సోదాల్లో భాగంగా పెనుగొండ నుంచి విజయవాడ వెళుతున్న కారును తనిఖీ చేయగా రూ.70,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸



కనకదుర్గమ్మగా రాట్నాలమ్మ
రాట్నాలకుంటలో రాట్నాలమ్మవారి తిరునాళ్లు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారు కనకదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. 8లో ▸



వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు
ఎన్నికల సమీపిస్తున్న సమయంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు మరింత జోరందుకున్నాయి. ఇతర పార్టీల నేతలు భారీగా వచ్చి చేరుతున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

ప్రచారానికి అనుమతులు తప్పనిసరి



వె.ప్రసన్న వెంకటేష్, కలెక్టర్

ఏలూరు(మెట్రో): రాజకీయ పార్టీలు, పోటీలో నిలిచే అభ్యర్థులు ప్రకటనలు, ప్రచార వీడియోలను జారీ చేసే సమయంలో తప్పనిసరిగా జిల్లా మీడియా సమన్వయ పర్యవేక్షణ కమిటీ ఆమోదం పొందాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఎన్నికల సంఘ మార్గదర్శకాల మేరకు కచ్చితంగా ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. అలాగే వాహనాల్లో వీడియో క్లిప్పులు ప్రదర్శిస్తూ ప్రచారం చేసిన సమయంలో, లోకల్, శాటిలైట్ చానల్స్‌లో ప్రచారాలకు అనుమతులు తప్పనిసరి అని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కోడ్ ఉల్లంఘన కింద పరిగణిస్తారని, రిటర్నింగ్ అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో, పత్రికల్లో వస్తున్న అనుకూల వార్తల నేపథ్యంలో ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు.

పార్లమెంట్ నియోజకవర్గ బరిలో 13 మంది

ఏలూరు (మెట్రో): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గానికి 17 నామినేషన్లు దాఖలు కాగా వాటిలో పరిశీలన అనంతరం నలుగురు నామినేషన్లను తిరస్కరించారు. ఏలూరు కలెక్టరేట్‌లో శుక్రవారం నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియ నిర్వహించామని, అభ్యర్థుల సమక్షంలో నామినేషన్లను పరిశీలించి 13 మంది బరిలో ఉన్నట్లు తెలియజేశారు.

చెరువులకు నీటి సరఫరా

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ గ్రామాల్లో తాగునీటి చెరువులు నింపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా రెండు రోజులుగా కృష్ణా కెనాల్ నుంచి విడుదలైన నీరు పంట కాలువ ద్వారా వేగంగా గ్రామాలకు పారేందుకు పనులు చేస్తున్నారు. ఉపాధి హామీ కూలీలతో కృష్ణ కెనాల్‌లో గుర్రపుడెక్క తొలిగించారు. జాలిపూడి పంట కాలువలో చేరిన ప్లాస్టిక్ వ్యర్థాలు, మాదేపల్లి, జాలిపూడి, శ్రీపర్రు కాలువ గట్లపై చెత్తాచెదారం తొలిగించారు. మాదేపల్లి, జాలిపూడి కూడలి వద్ద కాలువ నీటిని పంపింగ్ చేయడాన్ని శుక్రవారం ఈఓ పీఆర్డీ ఎం.సరళకుమారి పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు చెరువు నీటి శుద్ధికి చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. కొద్దిరోజులు గ్రామాల్లో చెరువులన్నీ పూర్తిగా నింపుతామని, వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టామని ఆమె అన్నారు.

రూ.207 కోట్ల విలువైన ధాన్యం సేకరణ

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఇప్పటివరకు 8,143 మంది రైతుల నుంచి రూ.207.31 కోట్ల విలువైన 1,05,638 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. శుక్రవారం ఆమె వివరాలు వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి 15,575 మంది రైతులకు చెందిన 1,26,274 టన్నుల ధాన్యాన్ని నమోదు చేశామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రూ.87.68 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామని, మరో రూ.119.63 కోట్లు జమ చేసే ప్రక్రియలో ఉందన్నారు.

2 నుంచి వేసవి క్రికెట్ శిక్షణ

ఏలూరు రూరల్: వచ్చేనెల 2 నుంచి 22 వరకు 19 ఏళ్లలోపు బాలబాలికలకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఆదిత్యవర్మ, కార్యదర్శి వీవీఎస్ఎం శ్రీనివాసరాజు ప్రకటనలో తెలిపారు. బాలురుకు ఏలూరు సీఆర్ఆర్ డిగ్రీ కాలేజ్ ఆవరణలో కోచ్ జి.సత్యనారాయణ (9490472111), భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలో టి.శ్రీనివాస్ (9110502929) శిక్షణ అందిస్తారని వెల్లడించారు. బాలికలకు ఎస్.రమాదేవి (7989153915), పి.ప్రియాంక (8328043304) డీఎన్నార్ కళాశాలలో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఆధార్, పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రాలతో పాటు సొంత కిట్‌తో వచ్చేనెల 2న ఉదయం 6 గంటలకు హాజరుకావాలని, మరిన్ని వివరాలకు కోచ్‌లను సెల్ నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

ఆరోగ్య రక్షణకు చర్యలు

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర విపత్తు నివారణ సంస్థ అధిక ఉష్ణోగ్రతలు ఉండవచ్చని హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో కార్మికుల రక్షణకు చర్యలు తీసుకోవాలని ఏలూరు ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ ప్రకటనలో తెలియజేశారు. అధిక ఉష్ణోగ్రతల సమయంలో దుకాణాలు, సంస్థలు, ఫ్యాక్టరీలు, భవన, ఇతర నిర్మాణ కట్టడాల్లో పనిచేసే కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పని గంటల రీ-షెడ్యూల్ చేసుకోవాలని, కార్మికులకు సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వైద్యారోగ్య శాఖ అధికారుల సహకారంతో కార్మికుల ఆరోగ్యాన్ని పరిరక్షించాలన్నారు.

జగన్ మామకు జై కొడుతూ..



మాకు ఓటు లేకున్నా..

మేమంతా జగన్ మావయ్యకు అండగా ఉంటాం.. మా ఇళ్లల్లోని ఓట్లన్నీ జగన్ మావయ్యకే వేయిస్తాం.. అంటూ చిన్నారులు వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యక్రమానికి స్వచ్ఛందంగా తరలివచ్చారు. మా బడులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారని, విద్యాకానుక, అమ్మఒడి, గోరుముద్ద వంటి పథకాలతో పేద విద్యార్థుల చదువులకు భరోసాగా నిలిచారని నినాదాలు చేశారు. గణపవరంలో కనిపించిన దృశ్యమిది.

– గణపవరం

వైఎస్సార్ పింఛన్ కానుకతో

అవ్వాతాతలకు కొండంత అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అంతటా నీరాజనాలు అర్పిస్తున్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని కొనియాడుతున్నారు. ఏలూరు 50వ డివిజన్ ఎంఆర్‌సీ కాలనీలో కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఆర్ఎం పెదబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించగా.. ఓ వృద్ధురాలు వైఎస్సార్‌సీపీ బ్రోచర్‌పై ఉన్న సీఎం జగన్ చిత్రపటాన్ని ముద్దాడుతున్న దృశ్యం ఆకట్టుకుంది.

– ఏలూరు టౌన్

మా మనవడు అంటూ ముద్దాడుతూ..



గురువులకు గౌరవం

- ఉద్యోగాలిచ్చి ఆదుకున్న సీఎం జగన్
- గత డీఎస్సీల అభ్యర్థులకూ కొలువులు
- ఏళ్ల నాటి కల సాకారం
- జిల్లాలో 722 మందికి ఉద్యోగాలు
- ప్రభుత్వ విద్యారంగంలో మైలురాయి



పాఠశాలలో గ్రీన్ చాక్‌బోర్డ్‌పై పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యతోనే అభివృద్ధి సాధ్యమని భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. దీనిలో భాగంగా ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న డీఎస్సీల అభ్యర్థులకు ఉపాధ్యాయ కొలువులు అందించారు. గత ప్రభుత్వాలు డీఎస్సీ పరీక్షలు నిర్వహించి పలు కారణాలతో ఉద్యోగాలు భర్తీ చేయకుండా వదిలివేసిన అభ్యర్థులకు సీఎం జగన్ పూర్తిస్థాయిలో న్యాయం చేశారు. ఇలా 1998, 2008 డీఎస్సీల క్వాలిఫైడ్ అభ్యర్థులకు, 2018 డీఎస్సీ అభ్యర్థులకు జగన్ హయాంలో ఉద్యోగాలు ఇచ్చి వారి కుటుంబాలకు అండగా నిలిచారు.

డీఎస్సీలు ఎవరు నిర్వహించినా ఉద్యోగాలిచ్చింది జగనే..

1998లో చంద్రబాబు ముఖ్యమంత్రి ఉండగా, 2008లో కాంగ్రెస్ అధికారంలో ఉండగా డీఎస్సీలు నిర్వహించారు. 2018లో చంద్రబాబు పాలనలో మరోసారి డీఎస్సీ నిర్వహించారు. రాష్ట్రంలో వేలాది మంది నిరుద్యోగులు పరీక్షలు రాసి అర్హత సాధించారు. తమకు ఉద్యోగాలొస్తాయని, ఉపాధ్యాయ వృత్తిలో చేరవచ్చని ఆశగా ఎదురుచూసిన వారికి నిరాశే ఎదురయ్యింది. అటువంటి కుటుంబాలకు జగన్ ప్రభుత్వం భరోసా కల్పించింది.

దశాబ్దాల కలలకు రూపం : డీఎస్సీల్లో అర్హత సాధించిన వారు ఉద్యోగాల కోసం చూస్తూ సంవత్సరాలు గడిచిపోయాయి. డీఎస్సీలో అర్హత సాధించినా తమకు ఎందుకు ఉద్యోగాలు రావడం లేదో వారికి అర్థం కాక నిస్తేజంలో ఆశలు వదులుకున్నారు. కొందరు చిన్నపాటి ప్రత్యామ్నాయాలు చూసుకున్నారు. అటువంటి సమయంలో సీఎం జగన్ దేవుడిలా వారి కలలను సాకారం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని వేల కుటుంబాలకు ఆసరాగా నిలిచారు. ఇలా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 700 మందికి పైగా అభ్యర్థులకు ఉపాధ్యాయ కొలువులు అందించారు.

722 ఉపాధ్యాయ ఉద్యోగాలు

1998, 2008 డీఎస్సీలు రాసి అర్హత సాధించినా ఉద్యోగాలు రాని వారు కొందరైతే.. 2018 డీఎస్సీలో అర్హత సాధించిన ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారు మరికొందరు ఉన్నారు. దాదాపు 20 ఏళ్లుగా కొలువు కోసం ఎదురుచూస్తున్న వారికి జగన్ ప్రభుత్వం తీపికబురు చెప్పింది. 1998, 2008 డీఎస్సీల్లో అర్హత సాధించిన వారికి మినిమం టైం స్కేల్ ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించింది. అలా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 452 మందికి ఉద్యోగాలిచ్చి గౌరవించింది. అలాగే గత ప్రభుత్వం నిర్వహించిన 2018 డీఎస్సీకి సంబంధించి అర్హులైన 270 మందికి నేరుగా కౌన్సెలింగ్ నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చింది. అప్పటి నుంచి ఉపాధ్యాయ ఉద్యోగాలివ్వాలంటే జగనే అధికారంలో ఉండాలనే అభిప్రాయం అటు బీఈడీ ఉత్తీర్ణులైన వారితో పాటు ప్రస్తుత ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారికీ బలంగా నాటుకుంది.

కుటుంబ సభ్యుల్లా చూసుకుంటూ..



సీఎం జగన్ రాష్ట్రంలో ఉపాధ్యాయులను కుటుంబసభ్యుల్లా చూసుకుంటున్నారు. వారికి అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నారు. గతంలో ఉపాధ్యాయుల కొరతతో పనిచేస్తున్న వారిపై ఒత్తిడి ఉండేది. పాత డీఎస్సీల్లో అర్హులైన వారికి మినిమమ్ టైమ్ స్కేల్ విధానంలో జగన్ ఉద్యోగాలు కల్పించడంతో ఇప్పుడు పనిభారం తగ్గింది. నాడు– నేడుతో పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించడం, డిజిటల్ తరగతులు వంటివి తీసుకురావడంతో బోధన మరింత సులభతరమైంది.

– గెద్దం సుధీర్, వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

వందల కుటుంబాలకు జీవం



ఉద్యోగాల కోసం 20 ఏళ్లకుపైగా ఎదురుచూస్తున్న డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు సీఎం జగన్ ఉద్యోగాలిచ్చి ఆదుకున్నారు. దీంతో పాటు ఆయా కుటుంబాలకు జీవం పోశారు. డీఎస్సీ అర్హులైనా ఉద్యోగాలు రాక కొందరు అభ్యర్థులు కూలి పనులు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. అటువంటి వారంతా ఇప్పుడు ఉద్యోగాలు చేసుకుంటూ సంతోషంగా జీవిస్తున్నారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులందరినీ రెగ్యులరైజ్ చేస్తే ముఖ్యమంత్రి ఫొటోను మందిరాల్లో పెట్టుకుని పూజిస్తారు.

– తోట ఎడ్వర్డ్, ఎంటీఎస్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

వాగులో మునిగి ముగ్గురు మృతి



వాగు ప్రాంతంలో ముగ్గురి మృతదేహాలు

జంగారెడ్డిగూడెం రూరల్: సరదాగా జల్లేరు ప్రాంతానికి వచ్చి వాగులో మునిగి ముగ్గురు మృతిచెందిన విషాద ఘటన జంగారెడ్డిగూడెం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జీలుగుమిల్లి మండ లం దిబ్బగూడెం గ్రామానికి చెందిన మౌలాలి జంగారెడ్డిగూడెం మండలం జల్లేరు వాగులో చేపల వేట సాగిస్తుంటాడు. తెలంగాణలోని అశ్వారావుపేటకు మండలం ఊట్లపల్లి గ్రామానికి చెందిన షేక్ రేష్మ, అతని సోదరుడు షేక్ హసద్‌లు బంధువు అయిన మౌలాలి ఇంటికి దిబ్బగూడెం వచ్చారు. శుక్రవారం మౌలాలితో పాటు అతడి భార్య మొహిషాద్ (23), రేష్మ (24), హసద్ (14), మరో వ్యక్తి జల్లేరు ప్రాంతానికి సరదాగా వచ్చారు. మౌలాలీ చేపల వేట కు వల కోసం వెళ్లిన సమయంలో మొహిషాద్, రేష్మ, హసద్ జల్లేరు వాగులోకి దిగి ప్రమాదవశాత్తు మునిగి గల్లంతయ్యారు. వీరు స్నానానికి దిగారని, సెల్ఫీ తీసుకుంటుండగా మునిగిపోయారని స్థానికులు అంటున్నారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి ముగ్గురి మృతదేహాలను ఒడ్డుకు చేర్చారు. మృతురాలు రేష్మ హైదరాబాద్‌లో స్థిరపడింది. జంగారెడ్డిగూడెం డీ ఎస్పీ రవిచంద్ర, సీఐ రాజేష్, ఎస్సై జ్యోతిబాస్ ఘటనా స్థలానికి వచ్చి దర్యాప్తు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషాద ఘటనతో మృతుల కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

యాదవులంతా వైఎస్సార్‌సీపీ వెంటే..

- బీసీలకు సీఎం జగన్ పెద్దపీట
- యాదవుల ఆత్మీయ సమ్మేళనంలో నేతలు



యాదవుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని. చిత్రంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్

పెదపాడు: యాదవ సామాజికవర్గానికి పెద్దపీట వేసింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమే అని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని), దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, వైఎస్సార్‌సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ అన్నారు. మండలంలోని వట్లూరు శ్రీ కన్వెన్షన్ హాలులో దెందులూరు, ఏలూరు నియోజకవర్గాల యాదవుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ గత పాలకులు బీసీలను ఓటు బ్యాంకుగానే చూశారని, వారి అభివృద్ధికి ఎన్నడూ పాటుపడింది లేదన్నారు. మీకు మేలు జరిగితేనే ఓటు వేయండని అడగగల దమ్మున్న నాయకుడు దేశంలో ఎవరైనా ఉన్నారంటే ఒక్క సీఎం జగన్ మాత్రమే అన్నారు. పవన్‌కు చిత్తశుద్ధి లేదని, ఆ పార్టీకి అజెండా లేదని, రాష్ట్రం అభివృద్ధి చెందాలనే ఆలోచన లేదని, కేవలం చంద్రబాబును గద్దె నెక్కించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు తాను ఎలాగైనా సీఎం కావాలనే లక్ష్యంతో అన్ని పార్టీలను కలుపుకుని కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. ఎవరెన్ని కుయుక్తులు పన్నినా ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెంటే వైపు ఉన్నారని అన్నారు.

ఎవరెంత మంది కలిసి వచ్చినా..

దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ గతంలో దెందులూరులో అరాచక పాలన సాగిందని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను చాలా ఇబ్బందులు, కేసులు పెట్టారని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో దెందులూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేశారని, వారికి మేమంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సీఎం జగన్‌ను నేరుగా ఎదుర్కోలేక టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఐ, కాంగ్రెస్, సీపీఎం అన్ని పార్టీలు జత కట్టి యుద్ధం ప్రకటించాయని ధ్వజమెత్తారు. ఎవరెంత మంది వచ్చినా ప్రజలంతా సీఎం జగన్‌వైపే ఉన్నారన్నారు.

పారిశ్రామికాభివృద్ధికి కృషి

వైఎస్సార్‌సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో రైతులు, యువత కోసం కష్టపడి పనిచేస్తానని, వారి సమస్యలపై పార్లమెంట్‌లో ప్రశ్నిస్తానని, కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాస్తానని అన్నారు. ఈ ప్రాంతానికి పరిశ్రమలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ మాజీ అధ్యక్షుడు కొఠారు రామచంద్రరావు, టీటీడీ బోర్డు మెంబరు నెర్సు నాగసత్యం, యాదవ సామాజికవర్గ నేతలు సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుడు ముదుగురు సూర్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షుడు, ఏలూరు నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, యాదవ సంఘ రాష్ట్ర నాయకుడు లాకా వెంగళరావు, బీసీ నాయకులు చలమోలు అశోక్‌గౌడ్, దిమ్మిటి రమేష్, కొలుసు గణపతి, అప్పనబోయిన నర్సింహరావు, గోరుముచ్చు గోపాల్‌యాదవ్, ఏఎంసీ చైర్మన్ నెర్సు చిరంజీవి, నెర్సు రాంబాబు, మోరు రామరాజు, వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజయ్‌కుమార్, గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్, నెర్సు సుబ్బయ్యయాదవ్, బాల త్రిపురసుందరి, తొందురు క్రాంతికుమార్, కట్టా సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం.. ఉత్సాహంగా ప్రచారం



ఏలూరు టూటౌన్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ పరిధిలోని 37, 38 డివిజన్లలో శుక్రవారం ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని ఉత్సాహంగా ప్రచారం చేశారు. ప్రజలతో మమేకమవుతూ.. ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తూ ఆయన ముందుకు సాగారు. ఏలూరు నియోజకవర్గంలో 58 నెలల కాలంలో సుమారు రూ.447 కోట్లను సంక్షేమ పథకాల రూపంలో పేదల ఖాతాల్లో జమ చేసినట్టు ఆయన చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.

ఏసీబీ అదుపులో త్రీటౌన్ సీఐ



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ సుబ్బరాజు

ఏలూరు టౌన్: ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అవినీతి కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు వలపన్ని పెద్ద చేపను పట్టుకున్నారు. తొలుత కానిస్టేబుల్ ఇస్సాకును ఏసీబీ అధికారులు పట్టుకోగా.. విచారణ చేసిన అధికారులు నిందితులపై కేసులు నమోదు చేశారు. ఏకంగా త్రీటౌన్ సీఐ అవినీతి కేసుల్లో దొరికిపోవటం చర్చనీయాంశంగా మారింది. ఏలూరు ఏసీబీ డీఎస్పీ వి.సుబ్బరాజు తెలిపిన వివరాల ప్రకారం.. త్రీటౌన్ స్టేషన్‌లో రెండు చీటింగ్ కేసుల్లో వట్లూరుకు చెందిన రైల్వే ఉద్యోగి పెందుర్తి విక్టర్‌బాబు నిందితుడిగా ఉన్నాడు. తనను అరెస్టు చేయకుండా స్టేషన్ బెయిల్ ఇవ్వాలంటూ హైకోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నాడు. అయితే త్రీటౌన్ సీఐ వెంకటేశ్వరరావు రూ.50 వేలు డిమాండ్ చేశారు. కొంతకాలం విక్టర్‌బాబు పోలీసులకు కనిపించకుండా తప్పించుకుని తిరుగుతూ ఉండగా, త్రీటౌన్ కానిస్టేబుల్ డి.రాజేంద్ర అతని ఇంటికి వెళ్లి స్టేషన్‌కు రావాలంటూ ఒత్తిడి చేశారు. అనంతరం కానిస్టేబుల్ రాజేంద్ర సీఐ వెంకటేశ్వరరావు వద్దకు బాధితుడు విక్టర్‌బాబును తీసుకువెళ్లగా రూ.2 లక్షలు ఇవ్వాలని లేకుంటే కేసులో సెక్షన్లు మార్చివేస్తామని బెదిరింపులకు దిగారు. బాధితుడు విక్టర్‌బాబు ఏసీబీ అధికారులను ఆశ్రయించటంతో ఏసీబీ డీఎస్పీ సుబ్బరాజు ఆధ్వర్యంలో గురువారం రాత్రి 8.30 గంటలకు ట్రాప్ చేశారు. విక్టర్‌బాబు సొమ్ములు తీసుకుని త్రీటౌన్ స్టేషన్‌కు రాగా, ఇస్సాకు తన ఫోన్‌లో నుంచి త్రీటౌన్ సీఐ వెంకటేశ్వరరావుతో మాట్లాడగా డబ్బులు ఇస్తారు తీసుకోమని చెప్పారు. ఈ అవినీతి కేసులో విచారణ చేపట్టగా ప్రధాన నిందితుడిగా ఏలూరు త్రీటౌన్ సీఐ వెంకటేశ్వరరావును నిర్ధారించారు, రెండో నిందితుడిగా స్టేషన్ కానిస్టేబుల్ రాజేంద్రను నిర్ధారిస్తూ కేసు నమోదు చేశారు. ఇప్పటికే కానిస్టేబుల్ ఇస్సాకును రిమాండ్‌కు తరలించగా సీఐ, కానిస్టేబుళ్లను ఆరోగ్య పరీక్షల అనంతరం రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ సుబ్బరాజు తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే ఉజ్వల భవిష్యత్తు



జగన్నాథపురంలో మహిళలకు ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

జగన్నాథపురం ప్రచారంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

గణపవరం: ఎలాగైనా అధికారం దక్కించుకోవాలన్న ఏకైక లక్ష్యంతో ప్రజాదరణలేని పెత్తందార్లందరూ ముఠాకట్టి బూటకపు హామీలతో ప్రజలను ఏమార్చడానికి వచ్చారని, వారి బూటకపు హామీలను నమ్మవద్దని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం రాత్రి గణపవరం మండలంలోని జగన్నాథపురంలో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు కేరింతలతో జైజగనన్న, జైవాసన్న అంటూ నినాదాలతో హోరెత్తించారు. సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో రాష్ట్రం సంక్షేమ రాజ్యంగా అవతరించిందని, ఐదేళ్ల పాలనలో పేదలకు నూరుశాతం న్యాయం జరిగిందని అన్నారు. సిఫార్సులు, లంచాలు లేకుండా సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమచేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని, అలాంటి పారదర్శక పాలన జగన్‌తోనే సాధ్యమన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లామన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరిగి ఐదేళ్ల కాలంలో పేదలకోసం అమలు చేసిన పథకాలను వివరించారు. టీటీడీ సభ్యుడు గాదిరాజు సుబ్బరాజు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు నౌడు వెంకట రమణ, గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, సర్పంచ్ మూర అలంకారం, పార్టీ జిల్లా కార్యదర్శి నడింపల్లి సోమరాజు, పార్టీ నాయకులు కాకర్ల శ్రీను, మాదేటి సురేష్, అడబాల రంగా, వేగేశ్న సుబ్బరాజు, ఏడుకొండలు,రాజా కేశవ, కొండేటి వెంకటరత్నం, రొంగల శ్రీను పాల్గొన్నారు.

ప్రజలను వంచించడానికే కూటమి

దొరసానిపాడు ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వనిత



దొరసానిపాడులో ప్రజలకు అభివాదం చేస్తున్న హోం శాఖ మంత్రి తానేటి వనిత

ద్వారకాతిరుమల : జగనన్న అందించిన సంక్షేమం, అభివృద్ధి పాలనకు ప్రజలు మరోసారి పట్టం కట్టాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత కోరారు. మన గోపాలపురం – మన ఆడపడుచు ఎన్నికల ప్రచార ర్యాలీని మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. దొరసానిపాడు, వేంపాడు, పంగిడిగూడెం, గొల్లగూడెం గ్రామాల్లో నిర్వహించిన ర్యాలీలో మంత్రి వనితకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అలాగే మహిళలు గుమ్మడి కాయలతో దిష్టి తీసి, హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ వైఎస్సార్ సీపీతోనే ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధే ఇందుకు నిదర్శనమన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తులపై ఓట్లు వేసి తనను, రాజమండ్రి ఎంపీ అభ్యర్థి గూడూరు శ్రీనివాస్‌ను గెలిపించాలని ఆమె ఓటర్లను అభ్యర్థించారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, సర్పంచ్‌లు పోల్కంపల్లి అనీల్, లక్కాబత్తుల సిద్ధిరాజు, చవల రమేష్, ప్రత్తిపాటి యోహాను, బొండాడ నాగభూషణం, పెద్దిన దిలీప్, ఎంపీటీసీ అల్లాడ హరేరామకృష్ణ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ భాషా, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కనకదుర్గాదేవి అలంకరణలో రాట్నాలమ్మ



కనకదుర్గ అలంకరణలో దర్శనమిచ్చిన రాట్నాలమ్మ అమ్మవారు

పెదవేగి: రాట్నాలకుంటలో వేంచేసియున్న శ్రీ రాట్నాలమ్మ అమ్మవారి తిరునాళ్లు వైభవంగా జరుగుతున్నాయి. తిరునాళ్లలో భాగంగా శుక్రవారం నాలుగో రోజు అమ్మవారు శ్రీకనకదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు విఘ్నేశ్వర పూజ నవగ్రహ మండపార్చన, పరిసర దేవాతార్చన, కుంకుమార్చనలు జరిగాయి. అనంతరం మేళతాళాలు, కోలాట భజనలు, నృత్యాలతో రాట్నాలకుంట, రాయన్నపాలెం, కొండలరావుపాలెం గ్రామాల్లో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు కుంకుమార్చన, మంగళహారతి మంత్రపుష్పం, ప్రసాద వితరణ అందించారు. లక్ష్మీపురం మహిళల కోలాట ప్రదర్శన అలరించింది. రాత్రి 8 గంటలకు అమ్మవారి కోనేరులో తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం దువ్వకు చెందిన శ్రీదానేశ్వరి ఫైర్‌వర్క్స్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చారు. సన్నీ ఈవెంట్స్ హైదరాబాద్ వారిచే సినీమ్యూజికల్ నైట్ ఆకట్టుకుంది. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

బిడ్డతో సహా మహిళ అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బిడ్డతో సహా మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మంగయ్య తెలిపారు. వివరాల ప్రకారం చల్లవారిగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన ఓ మహిళ వివాహమై ఐదేళ్ల పాప ఉంది. అనారోగ్యంతో ఐదేళ్ల క్రితం భర్త చనిపోవడంతో సోదరుడి ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 21వ తేదీ సాయంత్రం నుంచి తల్లీకూతుళ్లు కనిపించడం లేదు. చుట్టుపక్కల, బంధువుల ఇంటి వద్ద వాకబు చేసినా వారి ఆచూకీ తెలియకపోవడంతో మహిళ సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన చెల్లెలు కనిపించకపోవడానికి సందిపోగు ఆశీర్వాదం అనే వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

వైఎస్సార్ సీపీతోనే గిరిజనుల అభ్యున్నతి

పార్టీ పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థిని తెల్లం రాజ్యలక్ష్మి



వేలేరుపాడు మండలం తెల్లిపల్లి గ్రామంలో వెదురుతడికలు అల్లుతున్న వైఎస్సార్ సీపీ పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థిని తెల్లం రాజ్యలక్ష్మి

వేలేరుపాడు: జగనన్న ప్రభుత్వంతోనే గిరిజనుల అభ్యున్నతి సాధ్యమైందని, పోలవరం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని భూదేవిపేట, బండలబోరు, మల్లారం, జిన్నెలగూడెం, తెల్లిపల్లి, కొత్రాజుగూడెం, చెరువుగొల్లగూడెం, చాగరపల్లి, పడమటిమెట్ట, నార్లవరం కాలనీ, తదితర గిరిజన గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్ నవరత్నాల పథకాలతో పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. ఐదేళ్ళ కాలంలో ప్రజలకిచ్చిన హామీలను వందశాతం అమలు చేశారని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.2.50 లక్షల కోట్లను ప్రజల బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా జమ చేశారన్నారు. ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్ళీ సీఎంను చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

వైఎస్సార్ సీపీని బలపరచండి

సీతంపేట ప్రచారంలో దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



సీతంపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: పేద, బడుగు, బలహీన వర్గాలు గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీని బలపరచాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. శుక్రవారం సీతంపేటలో సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత కనకరాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), ఎంపీటీసీ పులవర్తి వరమణి, నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల పథకాల అమలుతో పాటు అభివృద్ధి, సంక్షేమం, ఇళ్ల పట్టాల పంపిణీ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున అమలు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లనూ ఫ్యాన్ గుర్తుపై వేసి ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. సీతంపేట గ్రామంలో వందలాది ద్విచక్ర వాహనాలతో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జెండాలు చేతపట్టి ద్విచక్రవాహనాలపై జయహో జగన్ అంటూ ర్యాలీ చేశారు. ప్రచారంలో జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, నాయకులు చలమోలు అశోక్‌గౌడ్, వర్రె సత్తిబాబు, ఉదయభాస్కర్, గాంధీ, రాజు, అనపర్తి శ్రీనివాస్, సంతోష్, గ్రామస్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి మరోసారి మద్దతిద్దాం

ముక్కొల్లుపాడు ప్రచారంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



ముక్కొల్లుపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: గడిచిన 58 నెలల్లో ప్రజలకు చేకూరిన సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాబోయే ఎన్నికల్లో ప్రజలందరూ సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నూజివీడు అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పిలుపునిచ్చారు. మండలంలోని ముక్కొల్లుపాడు, తూర్పుదిగవల్లిలో శుక్రవారం ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. దారి పొడవునా మహిళలు ఎమ్మెల్యే ప్రతాప్‌కు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి కూడా ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. అప్పుడే రాష్ట్రంలోని ప్రజలందరూ సంతోషంగా ఉండటంతో పాటు రాష్ట్రం కూడా అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. గతంలో చంద్రబాబు బూటకపు హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన తరువాత ప్రజలను మోసం చేశాడని, వైఎస్ జగన్ మాత్రం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారన్నారు. అంతేగాకుండా గ్రామగ్రామాన సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ప్రజల గడప వద్దకే తీసుకువచ్చారన్నారు. నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్ల కాలంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులను చేశామన్నారు. 15వేల మంది పేదలకు నివేశన స్థల పట్టాలు ఇవ్వడమే కాకుండా పక్కా గృహాలను మంజూరు చేశామన్నారు. వందలాది మంది పేదలకు ఎస్సైన్‌మెంట్ పట్టాలను అందించామన్నారు. చంద్రబాబు ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని తుంగలో తొక్కి ప్రజలను మోసం చేయడం చూస్తూనే ఉన్నందున ఎవరూ నమ్మి ఓటు వేయొద్దన్నారు. ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఎంపీపీ ఆరేపల్లి శిరీష, విద్యా మౌలిక సదుపాయాల కల్పన సంస్థ రాష్ట్ర డైరెక్టర్ కలగర వెంకటేశ్వరరావు, సర్పంచ్ కంచర్ల సుబ్బలక్ష్మి, దిగవల్లి పీఏసీఎస్ అధ్యక్షులు ఎం దేవేంద్రరెడ్డి, ఎంపీటీసీ శ్యామ్, జే నర్సారెడ్డి, నాయకులు నక్కనబోయిన వెంకటేశ్వరరావు, పల్లే రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా నిత్యం ప్రజల్లోనే ఉన్నా

ముదినేపల్లిలో ప్రజాప్రతినిధుల సమావేశంలో ఎమ్మెల్యే డీఎన్నార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు/మండవల్లి: అభ్యర్థి కామినేని శ్రీనివాస్ ఓడినా, గెలిచిన అమెరికా, హైదరాబాదులో ఉంటారని, తాను గెలిచిన నుంచి నిత్యం నియోజకవర్గ గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉన్నానని, ఆలోచించి ఓటు వేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కోరారు. భైరవపట్నం శుభం ఫంక్షన్ హాలులో ముదినేపల్లి మండల ప్రజాప్రతినిధుల సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు గోట్రూ ఏసుబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాల్లో డబ్బు శాశ్వితం కాదన్నారు. ఇటీవల పార్టీని వీడిన జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు మధ్యలో వచ్చి మధ్యలోనే పోయారన్నారు. త్వరలో నియోజకవర్గ పర్యటనకు సీఎం వైఎస్ జగన్ వస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని బీజేపీ ప్రకటించిందని, క్రిస్టియన్, ముస్లింలు ఆ పార్టీకి ఓటు వేసే పరిస్థితి లేదన్నారు. టిప్పర్ డ్రైవర్‌కు సీటు ఇచ్చి తాను పేదల పక్షపాతి అని సీఎం నిరూపించుకున్నారన్నారు. కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర గౌడ సంఘ ఉపాధ్యక్షుల పోసిన చెంచురామారావు, వైఎస్సార్ సీపీ నేత బీవీ రావు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, సీనియర్ నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు మాట్లాడుతూ డీఎన్నార్ గెలుపునకు కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీలు రాచూరి రాధ, చొప్పర్ల సునీత, నాయకులు ఈడే వెంకటేశ్వరరావు, బేతపూడి వెంకటరమణ, జాస్తి బాబూ రాజేంద్రప్రసాద్, శీలం రామకృష్ణ, బత్తిన కిషోర్, మరీదు నాగయ్య, కోమటి విష్ణువర్ధన్, పోకల కృష్ణ, రాచర్ల సుబ్రహ్మణ్యం తదితర నాయకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీల్లో నగదు స్వాధీనం

ఉంగుటూరు: ఉంగుటూరులో ఎన్నికల చెక్‌పోస్టు వద్ద శుక్రవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.70,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆర్వో ఖాజావలి చెప్పారు. పెనుగొండ నుంచి విజయవాడకు కారులో తనిఖీలు చేయగా, ఎటువంటి ఆధారాలు లేకుండా మడిచర్ల అప్పారావు, నౌడు దుర్గారావు అనే వ్యక్తులు రూ.70,500 నగదు తీసుకువెళుతున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ నగదును సీజ్ చేసి ట్రెజరీకి అప్పగించామని ఆర్వో వివరించారు.

డీఈఎల్ఈడీ పరీక్షకు 112 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో శుక్రవారం నిర్వహించిన డీఈఎల్ఈడీ మూడో సెమిస్టర్ పరీక్షకు 63 మందికి 60, ఒకటో సెమిస్టర్ పరీక్షకు 54 మందికి 52 మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదుగురు గైర్హాజరయ్యారని, ఈ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు.

టీడీపీ, జనసేనను వీడి.. వైఎస్సార్ సీపీలోకి



ఎమ్మెల్యే అప్పారావు సమక్షంలో తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరిన రెంటపల్లి రాజ్‌కుమార్, బుర్రి సుధాకర్



చెరువుగొల్లగూడెంలో తెల్లం రాజ్యలక్ష్మి సమక్షంలో చేరిన 20 టీడీపీ కుటుంబాలు



దుద్దుకూరులో పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, అభ్యర్థిని రాజ్యలక్ష్మి



రావికంపాడు టీడీపీ నాయకులకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించిన కంభం విజయరాజు



చంటినాయన సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన పోలసానపల్లి టీడీపీ నాయకులు

నూజివీడు: దారిన వెళ్లేవారందరిని ఆపి కండువాలు కప్పే సంస్కృతి తమది కాదని, మనస్ఫూర్తిగా పార్టీలో చేరేందుకు వచ్చేవారినే తాము చేర్చుకుంటామని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నాలుగు రోజుల క్రితం పట్టణంలోని నెహ్రూపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు రెంటపల్లి రాజ్‌కుమార్, బుర్రి సుధాకర్, రెంటపల్లి సాయికుమారి తమ అనుచరులతో కలిసి నారా లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. అయితే అక్కడ ఇమడలేక తిరిగి శుక్రవారం సొంతగూటికి చేరుకున్నారు. వారితోపాటు 50 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరాయి. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడారు. బలవంతంగా పార్టీ కండువాలు కప్పి టీడీపీలో చేరినట్లుగా మసిపూసి మారేడుకాయ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి సంస్కృతి నియోజకవర్గంలో ఇంతవరకు లేదన్నారు. దీనిపై ఇక్కడి ప్రజలు కూడా సహించరని, తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్‌ను గెలిపించాలన్నారు. కౌన్సిలర్ కొప్పుల ప్రదీప్ కుమార్, నాయకులు కాళి సుగుణ రావు, పిల్లా చరణ్, బర్రె చంద్రశేఖర్, చేబత్తిన మున్నా, కాళి సురేష్ పాల్గొన్నారు.

చంటినాయన సమక్షంలో..

నూజివీడు: మండలంలోని పోలసానపల్లికి చెందిన పది కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకులు మేకా వేణుగోపాల అప్పారావు (చంటినాయన) సమక్షంలో చేరారు. గ్రామానికి చెందిన విద్యాకమిటీ మాజీ చైర్మన్ గుత్తి రంగబాబు, నారగాని శివ కుమార్, అచ్చి రంగారావు, వేముల తిరుపతిరావు, తమ్మిశెట్టి రాంబాబు తదితరులు పార్టీలో చేరగా, వారందరికి చంటినాయన వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. చంటినాయన మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకా ప్రతాప్ అప్పారావును, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌లను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. నాయకులు పలగాని రంగారావు, ఎంపీటీసీ పలగాని వెంకటరావు, మాజీ సర్పంచి నారగాని శంకర్‌రావు పాల్గొన్నారు.

చెరువుగొల్లగూడెంలో 20 టీడీపీ కుటుంబాల చేరిక

వేలేరుపాడు: మండలంలోని చెరువుగొల్లగూడెం గ్రామంలో టీడీపీకి చెందిన 20 కుటుంబాలు వైఎస్సార్ సీపీ పార్టీలో తెల్లం రాజ్యలక్ష్మి సమక్షంలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి రాజ్యలక్ష్మి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు గుజ్జా రామలక్ష్మి, ఎంపీపీ లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ మేడవరపు నాగశ్రీ, ఎంపీటీసీ సభ్యులు కొమ్మరాజు రాంబాబు, సర్పంచ్‌లు కట్టి ఉదయ్‌కిరణ్, లక్ష్మణ్, నాయకులు కామినేని వెంకటేశ్వరావు, ఎస్‌కే షౌకత్ హుస్సేన్, కొలూరి సత్తిరాజు, మెండెం కుమార్, చక్రి, మహేష్ పాల్గొన్నారు.

బాలరాజు, రాజ్యలక్ష్మి సమక్షంలో..

బుట్టాయగూడెం: వైఎస్సార్ సీపీలో పలువురు శుక్రవారం చేరారు. పోలవరం మండలానికి చెందిన పలువురు బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు తెలిపారు.

కంభం విజయరాజు సమక్షంలో..

కామవరపుకోట : రావికంపాడులో టీడీపీకి చెందిన 20 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. గుంటుపల్లి పంచాయతీ కంఠమనేనివారి గూడెంలోని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గోరుముచ్చు గోపాల్ నివాస గృహంలో చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు సమక్షంలో వీరు చేరారు. వీరికి కండువా వేసి విజయరాజు పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన నచ్చి, ఆకర్షితులై వైఎస్సార్ సీపీ పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. మండల కన్వీనర్ మిడతా రమేష్, చింతలపూడి ఏఎంసి చైర్మన్ జగ్గవరపు జానకి రెడ్డి, మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, ఈస్ట్ యడవల్లి సర్పంచ్ పొన్నాల అనిత, కనుమూరి అంజిరెడ్డి, కోటగిరి శ్రీకాంత్, మెరుగు బాబురావు పాల్గొన్నారు.